# నమ్మకమైన దాసుడు ఎలియాజరు

## పరిచయం:

ఎలియాజరు అనే పేరుతో మొత్తం తొమ్మిది మంది వ్యక్తులు ఉన్నారు. అందులో అబ్రాహాము సేవకుడైన ఎలియాజరు గూర్చి ఈ రోజు ధ్యానిద్దాము. అబ్రాహాము బహుకాలము గడచిని వృద్ధాప్యంలో నున్నాడు. తన పెద్ద దాసుడైన ఎలియాజరును పిలచి, ఇప్పుడు నేను కాపురమున్న కనానీయుల కుమార్తెలలో ఎవ్వరిని నా కుమారునికిచ్చి వివాహం చెయ్యను. నా స్వదేశానికి వెళ్లి, నా కుమారుని కొరకు ఒక అమ్మాయిని తీసుకురమ్మని ప్రమాణం చేయించాడు, ఎందుకంటే వారు విగ్రహారాధికులు. బైబిల్ చెపుతుంది కదా, మీరు అవిశ్వాసులతోజోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమిపొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది? దేవుని ఆలయ మునకు విగ్రహములతో ఏమిపొందిక? మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము (2 కొరింది 6: 14–16).

అబ్రాహాము ఏకైక నిజ దేవుణ్ణి ఆత్మలో సత్యంలో ఆరాధించాడు (యోహాను 4:24). కనానువాళ్ళు అనేకమంది దేవుళ్ళనూ విగ్రహాలనూ పూజించేవారు. ఇలాంటి విషయాల నుంచి తన కొడుకును దూరంగా ఉంచాలని అబ్రాహాము ఉద్దేశం. కనానుజాతికి చెందిన కోడలు తన కొడుకును విగ్రహ పూజకు మళ్ళిస్తుందేమో అని అతడు అనుకున్నాడు (ద్వితీ 7:3-4; 1 రాజులు 11:1-6; ఎజ్రా 9:1-4; 1 కొరింతు 7:39; 2 కొరింతు 6:14-18 అందుచే, అబ్రాహాము ఎలియాజరును స్వదేశానికి పంపిస్తున్నాడు.

## 1. ఎలియాజరు నమ్మకస్థుడు:

ఆదికాండము 24:2 - 4 అప్పుడు అబ్రాహాము తనకు కలిగిన సమస్తమును ఏలుచుండిన తన యింటి పెద్దదాసునితో నీ చెయ్యి నా తొడక్రింద పెట్టుము ,నేను ఎవరి మధ్య కాపురమున్నానో ఆ కనానీయుల కుమార్తెలలో ఒక దానిని నా కుమారునికి పెండ్లిచేయక ,నా స్వదేశమందున్న నా బంధువులయొద్దకు వెళ్లి ఇస్సాకను నా కుమారునికి భార్యను తెచ్చునట్లు ఆకాశముయొక్క దేవుడును భూమియొక్క దేవుడు నైన యెహోవా తోడని నీ చేత ప్రమాణము చేయిం

చెదననెను.

కొడుకు వివాహ విషయములో ఎవ్వరిని కాదు అని తన దాసుని పంపిస్తున్నాడు అంటే, ఎంత నమ్మకం? అంతేకాదు, ఆదికాండము 24 వ అధ్యయములో మొదటి వచనంలో అబ్రాహాము వృద్ధుడుగా ఉన్నాడు మరియు బహుగా ఆశీర్వదించబడ్డాడు. ఆ సమయములో అబ్రాహామునకు కలిగిన సమస్తాన్ని ఎలుచున్న పెద్ద దాసుడుగా మనకు ఎలియాజరు కనిపిస్తాడు, ఎంత నమ్మకం? మనిషి జీవితములో నమ్మకం చాలా ముఖ్యం. 'నమ్మకమైనవానికి దీవెనలు మెండుగా కలుగును. ధనవంతుడగుటకు ఆతురపడువాడు శిక్షనొందక పోడు.' (సామెతలు 28:20).

Source: Pas Abhisheck

బహుశా ఈ ఎలియాజరు మొదటి నుండి అబ్రాహాము దగ్గర నమ్మకంగా ఉండి ఉంటాడు, అందుకే అందరిలో పెద్ద దాసునిగా ఉంచాడు, అంతేకాదు తన కొడుకు వివాహ బాధ్యత మొత్తం ఎలియాజరునకే అప్పగించాడు.

'మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును' (లూకా సువార్త 16:10).

## 2. విధేయుడు:

ఆదికాండము 24:10 - అతడు తన యజమానుని ఒంటెలలో పది ఒంటెలను తన యజమా నుని ఆస్తిలో శ్రేష్ఠమైన నానా విధములగు వస్తువులను తీసికొని పోయెను. అతడు లేచి అరామ్నహరాయిము లోనున్న నాహోరు పట్టణము చేరను...అబ్రాహాము తనకు చెప్పిన మాటలకు విధేయతచూపించి, పని ప్రారంభించడం మొదలు పెట్టాడు. దేవుణ్ణి సేవించాలనుకునే వారందరికీ ఈ సేవకుడు ఆదర్శంగా ఉన్నాడు. ఇతడు విధేయుడు, దేవుడు దారి చూపేవరకు ఎదురు చూచేవాడు, తన యజమానికి ప్రతిష్ఠ కలిగేలా నడుచుకునేవాడు. అది మధ్యప్రాచ్యంలోని నాహోరు అనే పట్టణం, సూర్యుడు అస్తమిస్తున్నాడు. సిరియా వాడైన ఎలియాజరు తన పది ఒంటెల పరివారంతో ఆ పట్టణ శివార్లలో ఉన్న బావి దగ్గరకు చేరుకున్నాడు. అలసిపోయి దప్పికతో ఉన్నప్పటికీ ఎలియాజరు ఇతరుల అవసరాలపట్ల ఎక్కువ శ్రద్ధ కల్గివున్నాడు. ఆయన తన యాజమాని కుమారునికోసం వధువును వెదకటానికి పరదేశం నుండి వచ్చాడు. పైగా ఆయన తన యజమానుని బంధువుల్లోనే అమ్మాయిని వెదకాల్సి ఉంది. విధేయతతో పని ప్రారంభించి బావి దగ్గర వచ్చి తన మీద ఆధారపడకుండా ఇప్పుడు దేవుని మీద ఆధారపడటం చూస్తాము.

## 3. ప్రార్ధనాపరుడు:

ప్రార్థనా శక్తిలో ఎలియాజరుకు విశ్వాసం ఉంది. చిన్నపిల్లవాడిలాంటి అసాధారణమైన విశ్వాసంతోఆయన వినయంగా ఇలా అభ్యర్థిస్తాడు: “నా యజమానుడగు అబ్రాహాము దేవుడవైన యెహోవా, నేను వచ్చిన కార్యమును త్వరలో సఫలముచేసి నా యజమానుడగు అబ్రాహాము మీద అనుగ్రహము చూపుము. చిత్తగించుము, నేను ఈ నీళ్ల ఊటయొద్ద నిలుచుచున్నాను; ఈ ఊరివారి పిల్లలు నీళ్లు చేదుకొనుటకు వచ్చుచున్నారు. కాబట్టి నేను త్రాగునట్లు నీవు దయచేసి నీ కడవను వంచుమని నేను చెప్పగా—నీవు త్రాగుము నీ ఒంటెలకును నీళ్లు పెట్టెదనని యే చిన్నది చెప్పునో ఆమెయే నీ సేవకుడైన ఇస్సాకుకొరకు నీవు నియమించినదై యుండునుగాక, అందువలన నీవు నా యజమానునిమీద అనుగ్రహము చూపితివని తెలిసికొందును.”—ఆదికాండము 24:12-14.

ప్రార్థనా శక్తిపై ఎలియాజరుకున్న నమ్మకం నిరర్థకం కాలేదు. అంతెందుకు, ఆ బావి దగ్గరకు వచ్చిన మొట్టమొదటి స్త్రీ అబ్రాహాము సహోదరుని మనవరాలే! ఆమె పేరు రిబ్కా, గుణవంతురాలైన చక్కని కన్య. ఆమె ఎలియాజరుకు త్రాగటానికి నీళ్లివ్వటం మాత్రమే కాదు ఆయన ఒంటెలన్నిటి దాహార్తిని తీరుస్తానంటుంది. కుటుంబమంతా చర్చించుకున్న తర్వాత, రిబ్కా ఎలియాజరుతోపాటు దూరదేశానికి వెళ్లి అబ్రాహాము కుమారుడైన ఇస్సాకునకు భార్యకావటానికి ఇష్టపడుతుంది. జరుగుతున్న సంఘటనల్లో దేవుడు అప్పుడప్పుడు అద్భుతరీతిగా జోక్యం చేసుకుంటున్న ఆ కాలంలో ఎలియాజరు ప్రార్థనకు ఎంత నాటకీయమైన స్పష్టమైన సమాధానం వచ్చింది!

Source: Pas Abhisheck

ఎలియాజరు ప్రార్థననుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చు. ఆయనకున్న విశిష్టమైన విశ్వాసాన్ని, వినయాన్ని ఇతరుల అవసరాలపట్ల అతనికున్న నిస్వార్థపు శ్రద్ధను అది చూపిస్తోంది. ఇంకా మానవజాతితో దేవుడు వ్యవహరించే విధానం పట్ల ఎలియాజరుకున్న విధేయతను కూడా ఆయన చేసిన ప్రార్థన చూపిస్తోంది. అబ్రాహాముతో దేవునికున్న ప్రత్యేక సంబంధం గురించి, అలాగే అబ్రాహాము ద్వారా సమస్త మానవజాతికి భవిష్యత్తులో ఆశీర్వాదాలు వస్తాయన్న దేవుని వాగ్దానం గురించి ఆయనకు తెలుసన్నదానిలో సందేహం లేదు. (ఆదికాండము 12:3) అందుకే, ఎలియాజరు తన ప్రార్థనను ఈ మాటలతో ప్రారంభించాడు: "నా యజమానుడగు అబ్రాహాము దేవుడవైన యెహోవా." ఎలియాజరు ప్రార్థిస్తూ ఒక సూచనను అడుగుతున్నాడు. పాతనిబంధనకాలంలో వాక్య ప్రత్యక్షత సంపూర్ణముగాలేని కారణం చేత, తరచుగా ఇట్లా సూచనలు అడిగేవారు. దేవుడు కూడా వాటిని అనుగ్రహించే వాడు. ఇట్లాంటి వారిలో అబ్రాహాము, గిద్యోను మొదలగు వారు కూడా వున్నారు.

## 4. కార్యనిర్వహన నేర్పుగలవాడు

ఇస్సాకునకు భార్యగా రిబ్కాను అబ్రాహాము చెప్పినట్లే కనుగొన్నాను, ఇంకా నా పని పూర్తి అయింది తన పని వదిలేయలేదు. రిబ్కా వాళ్ళ ఇంటికి వెళ్లి తన తల్లిదండ్రులకు జరిగిన విషయం, తను ఎవరో, ఎందుకు వచ్చానో అన్ని విషయాలు చెప్పి, తన తల్లిదండ్రులను ఒప్పించడము ఇక్కడ చూస్తాం. ఎంతో ఓర్పు, నేర్పు గల వ్యక్తిగా ఎలియాజరు మనకు కనిపిస్తాడు. అంతేకాకుండా అప్పుడే రిబ్కాకు ప్రధానము కూడా చేయిస్తాడు. "ఇదిగో రిబ్కా నీ యెదుట నున్నది, ఆమెను తీసికొని పొమ్ము; యెహోవా సెలవిచ్చిన ప్రకారము ఈమె నీ యజమానుని కుమారునికి భార్య అగునుగాకని ఉత్తర మిచ్చిరి. అబ్రాహాము సేవకుడు వారి మాటలు విని యెహోవాకు సాష్టాంగ నమస్కారము చేసెను.

తరువాత ఆ సేవకుడు వెండి నగలను బంగారునగలను, వస్త్ర ములను తీసి రిబ్కాకు ఇచ్చెను; మరియు అతడు ఆమె సహోదరునికి తల్లికిని విలువగల వస్తువులు ఇచ్చెను." (ఆదికాండము 24:51-53)

ఆ రాత్రికి అక్కడే బస చేసి తెల్లవారు జామున రిబ్కాను నాతో పంపమని అడిగి, మరల ఒప్పించి తనతో పాటుగా అబ్రాహాము ఇంటికి తీసుకొనివచ్చి, పొలములో ఉన్న ఇస్సాకు వద్దకు ఈ రిబ్కాను తీసుకొనివచ్చి జరిగిన విషయం చెప్తాడు. 'అప్పుడా దాసుడు తాను చేసిన కార్యములన్నియు ఇస్సాకుతో వివరించి చెప్పెను.' (ఆదికాండము 24:66) ఈ విధముగా అబ్రాహాము తనకు ఇచ్చిన పని ఓర్పుగా నేర్పుతో పూర్తి చేస్తారు.

పాత ఒడంబడికలోని కథలు తరుచుగా క్రొత్త ఒడంబడిక గ్రంథంలో తరువాత కనిపించే ఆధ్యాత్మిక సత్యాలకు సాదృశ్యాలు. తన కుమారుడి వివాహం జరిగించిన రాజును గురించి యేసు చెప్పిన ఉదాహరణకు (మత్తయి 22:2) ఈ అధ్యాయం దృష్టాంత రూపకంగా ఉన్నదని కొందరి అభిప్రాయం (ఇలాగని ఖచ్చితంగా చెప్పలేము). ఇది నిజమైతే గనుక అబ్రాహాము తన కుమారుడి పెళ్ళినిర్ణయించిన తండ్రియైన దేవునికి గుర్తుగా ఉన్నాడు. వధువును వెతికి సిద్ధపరచి ఆమెకు క్రీస్తును వెల్లడించే సేవకుడుగా పవిత్రాత్మ కనిపిస్తున్నాడు (యోహాను 16:13-14). రిబ్కా క్రీస్తు వధువుకు అంటే ఆయన సంఘానికి గుర్తుగా ఉంది (2 కొరింతు 11:2; ఎఫెసు 5:25-32; ప్రకటన 19:7-8). ఎదురు వెళ్ళి ఆమెకు కలుసుకున్న ఇస్సాకు యేసుప్రభువుకు గుర్తుగా ఉన్నాడు (యోహాను 14:3; 1 తెస్స 4:16-17)

Source: Pas Abhisheck

## ముగింపు:

అందుకు అబ్రాము ప్రభువైన యెహోవా నాకేమి యిచ్చిననేమి? నేను సంతానము లేనివాడనై పోవుచున్నానే; దమస్కు ఎలీయెజెరే నాయింటి ఆస్తి కర్తయగును గదా మరియు అబ్రాముఇదిగో నీవు నాకు సంతానమియ్యలేదు గనుక నా పరివారములో ఒకడు నాకు వారసుడగునని చెప్పగా"(ఆదికాండము 15:2,3)

అబ్రామునకు ఇంకా ఇస్సాకు పుట్టనపుడు తనకు కలిగిన ఆస్తి యావత్తూ తన బంధువులకో, తెలిసినవారికో కాకుండా తన పరివారములో ఒకడైన ఎలియాజరునకు ఇవ్వడానికి సిద్ధమయ్యాడు అబ్రాహాము ఎలియాజరుని ఎంత నమ్మాడో! ఎలియాజరు వలె నమ్మకమైన జీవితం, విధేయత కలిగిన జీవితం మరియు ప్రార్ధన పూర్వకమైన జీవితం కలిగి ప్రార్ధనతో అన్నిటిని జయించగలిగే కార్యనిర్వహన నేర్పుగలవాడుగా నీవు ఉండాలి అని ఆశిస్తూ, అన్నిటికి నీ సొంత నిర్ణయాలపైనో, నీ సొంత తెలివితేటలపైనో కాకుండా ఎలియాజరు వలే ప్రార్ధన పూర్వకముగా దేవునిపై ఆధారపడి, వాటన్నింటిని నీవు కూడా పొందుకోవాలి.........ఆమెన్!......